# "ముందు వెనకలు"

'దే శి రా జు'

చీకటి దట్టంగావుంది- వానపడుతోంది- మిణుగురు పురుగులు అక్కడక్కడా అగుపిస్తున్నాయి దూరన్న బైరాగుల గుంపు- తాగుబోతుల వేదాంతం వినిపిస్తోంది- అమ్మమ్మ చనిపోయి చాలా రోజులయింది- కాని ఎసురుగుండావుండే భయంకర ప్రకృతిలో మాయమయిన మాట మరచిపోలేను-

మనసులో మార్పు- హృదయావేదన- కల్మషమూ- అభిమానమూ, వింతా- ప్రేమ- నిరాకులు జీవితానికి కొంతవరకూ ఆధారం-

ఉన్నట్టువుండి గదిలో దీపం ఆరిపోయింది- చిన్న తమ్ముడు నన్ను కావలించుకున్నాడు- "భయంలేదు పడుకో అన్నాను" ఇంత భయం ఎందుకూ! నేనూ అంతే అమ్మమ్మ బ్రతికివున్న రోజుల్లో తన ప్రక్కలో పడుకునేవాణ్ణి-

అది ఇరవైయేళ్ల క్రితం కబురు- నాకు ఎంత భయమో అంత సరదా ఆ సరదాలు- ఆ కబుర్లు తలచుకుంటే మరిరావుకదూ అని విరక్తికలుగుతుంది-

ఆ దానిమ్మ చెట్టు కింద- చలికాలంలో అక్క- సుబ్బాయి ఎదురుపిల్ల రేవతి- బాబులు- చెలంగుజ్జనగుళ్లు ఆడుకోవడం వుసిరికాయలు తినడ్డూ అంతే మొండిగా తిని బలవంతంగా దగ్గడం కళ్ళకు కట్టినట్టు అగుపడుతాయి ఆ దినాలు-

వీధిలో కుక్క అరిచింది. పూర్తిగా వెలిగి టేబిల్ మీద ముద్దగా అయిపోయింది పాపం కొవ్వొత్తి. మరొకటి లేచివెలిగించడానికి ఓపిక లేకపోయింది. నాదగ్గర పడుకున్నాడు బాబు. "సీత" యింట్లో ఆబ్‌సెంట్ అందరకీ తెలిసిన కారణమే

చిన్నప్పుడు, అప్పుడప్పుడు వండుకోలేక పక్కయింటి బామ్మగార్ని బతిమాలుకొని.... కాలక్షేపం చేయడం మహాఆనందంగా వుండేది.

అక్క- సుబ్బాయి చనిపోయి ఏడాది నిండింది బావమట్టుకు నిర్విచారంగా మరొకర్ని పెళ్ళిచేసుకున్నాడు. కాని మళ్లీ ఎందుకు వివాహం చేసుకున్నాడా అనుకుంటూ, అందరూ అంటారు "బాగుపడ్డాడు" అని ఏమిటూ బాసు వెలితి అగుపించదూ ఆ అనుభవించిన దినాలు జ్ఞాపకానికి వచ్చి బాధ పెట్టవూ చక్కగా చలికాలంలో వెన్నెల్లో స్టేషన్ దాకా షైర్లు ఎలా మరచిపోగలడు? తప్పనిసరి అంతే- కాని సరదా మునుపటివలె వుండదేమో?

"చూడు సుభా! యింకొక్క ఇరవై ఏళ్ళ తరువాత మనలో ఎంత మార్పు వస్తుందో?" లైటువున్నది ఆరిపోయింది. కొవ్వొత్తి మరి లేదు.... చీకట్లో... నేనూ ....సుభా బాబునిద్రపోతున్నాము. తమ్ముడు కూడా.

"నేను బ్రతికి వుంటానా, మీ అక్కయ్య కొడుకు భాను ...40 ఏళ్లు నిండుతాయి- తాయికి 74 వస్తాయి. పెద్దవాళ్ళు అయిపోతారు." సుభ అంటోంది.

జోరుగాలి వీచింది, తోటలో చెట్టు ఆకు ఎగిరి ఇంట్లోపడింది, ఏమిటో అనుకొని తృళ్ళిపడి వేచింది సుభ "ఎందుకా భయం!

'జీవితానికి భయం లేకపోతే విలువలేదేమో?'

అవునన్నట్టు గోడమీద బల్లి చీకట్లో అదిరినట్టు అయింది,

"మీరు పదేళ్ళక్రితం రేవతిని అభిమానించి ప్రేమించారు కదూ ఇరవై ఏళ్ళ తరువాత ఆమె ఎలా వుంటుందో మిమ్మల్ని పూర్తిగా మరచిపోతుంది,'

"ఆందోళన హృదయంలో బరువుగా వుంది సుభా....మరి మాట్లాడకు అన్నాను.

"మీరు అటు వెళ్తే...తను పలుకరిస్తుందా, పాపం పూర్తిగా మారిపోతుంది పదేళ్ళక్రితం ... ఆ తొందరా, ఆ ప్రేమా, ఆదరాభిమానాలు ఆ దొంగ చూపులూ - ఎక్కడ పోతాయి.

"సుభా' ఇంతేకదూ జీవితం, ఇరవై ఏళ్ళ తరువాత నాకు గెడ్డం బాగా పెరిగి పోతుందికదూ ఇంత చక్కగా ముద్దుపెట్టుకున్న పెదిమలు అసహ్యం అవుతాయి...నన్ను గూస్తేనే"

'అలా అంటే నాకు బుర్ర తిరిగిపోతుంది.

అలాఅనకండి. ఏడ్పుకూడా వస్తోంది .... మా అమ్మ ఎంతపెద్దది ఐపోయిందో మనం పెద్దవాళ్లం ఐపోతే చిన్నవాళ్ళంతా పెద్దవాళ్లు ఐపోరూ మన చంద్రిక పిల్లలతల్లి ఐపోతుంది. ఎంతలో ఎంతమార్పు? అమాయకంగా అంది సుభ.

'ఔను సుభా జీవితం అంతా యింతే సుమా. నువ్వన్నదీ నిజమే మన మేష్టరు అసలు బ్రతికి వుండడు నువ్వు స్కూలుకు రోజూ జట్కామీద వెళ్ళేదానివికదూ, ఆజట్కావాడు గుర్రంబండి చక్రాలు ఏమౌతాయి! ఆ చెరువుగట్టు పక్క ఎన్ని యిళ్లు వేస్తాయో? ఆ ఎదురుగా వుండే కోవిల ఇరవై ఏళ్ళ తరువాత యింకా వుంటుందీ?'

మీ కథలు పూర్తిగా పాతపడుతాయి. చదివే వాళ్లు వుండరేమో పాపం మీరు పదిహేనేళ్ళ క్రితం నాకందిచినలేఖ ఇప్పుడువుంది కాని ఇరవై ఏళ్ళ తరువాత దానికి ఎన్నిఏళ్లు వస్తాయి? పూర్తిగా చినిగిపోదూ ఒక్కమారు ప్రథమ ప్రణయం జ్ఞాపకం తెచ్చింది సుభ.

"ఔ నేను. కాని సుభా గాంధవుపన్యాసాలు చేసి మతకలహాలు ఆపేదూ, "సురవర్ది" యముడులా ప్రవర్తించి ధర్మరాజులా మారేదూ అంటే. ప్రతీ యింట్లో బాకూలూ, బల్లేలూ దాచుకునేవారూ యింతే. మన అబ్బాయిలు, అమ్మాయిలు నమ్మతారంటావా ఇరవైఏళ్ళకు నేనుంటానంటావా?

"అబ్బ' ఆ మాట అనకండీ నేనూ మీరూ బాగా ముసలి ఐపోతాం మళ్లీ ఈ రోజు జ్ఞాపకం వుంటుందీ వున్నా యిరవైఏళ్ళ తరువాత ఎంత పాతబడి పోయినమాట అని అనుకుంటాం ఎంత పెద్ద వాళ్లం అయిపోతాం.

"ఎదుగుతూవున్న అబ్బాయిలూ, అమ్మాయిలూ కష్టాల్లో. సుఖాల్లో బాధ్యత తెలియకుండా ఆ జన్మరీతిగా ఈదుకుంటూ వెళ్లతారు జీవితాన్ని మరికొన్ని ఏళ్లల్లో సుబ్బాయమ్మ చనిపోతుంది, గురువులు పెద్దవాడయిన తరువాత పళ్లదుకాణం పెడ్తాడుట, ఆమోటారు షెడ్డు ఈ మాటు గాలి వానకు పడిపోతుంది!

అంతే నాతోస్నేహంచేసిన శశికాంత పురిటిలో చనిపోతుందని జ్యోతిష్కుడు చెప్పేడు. అవధానులగారి అమ్మాయి విధవ అయింది. ఇరవై ఏళ్లలో ఎన్ని కష్టాలుపడాలో అంతా అంతేనేమో,' బరువుగా శ్వాసలేస్తూ చెప్పింది సుభ.

"రెండు కొట్టేరు, చలిబాగా వేస్తోంది. కొంచెం కప్పు సుభా చలిపాదాలు తాకుతోంది,' అని అన్నా.

"ఇరవై ఏళ్ళ మునుపు అమ్మకప్పేది, మా అన్నయ్య యం ఏ, పరీక్షకు వెళ్లాడు, తాతగారు సారాయి తాగడం మానలేక చనిపోయారు, అవన్నీ ఎప్పటి మాటో చూడు," అన్నా.

"ఔను' సుభ నిద్రతో మూలిగింది.

"సరేపడుకో? రెండు మూడు చినుకులు ఇంటి శ్రేణిలో నుండి పక్కమీద పడ్డాయి, వూర్లో వానకురుస్తోంది. గదిలో చీకటిగానేవుంది.